క్లుప్తంగా

కొనసాగుతున్న మాజీ మంత్రి రోజా వితరణ



పుత్తూరులో పౌష్టికాహారంతో గర్భిణులు

పుత్తూరు: పుత్తూరు, నగరి ప్రభుత్వ ఆసుపత్రుల్లో మాజీ మంత్రి ఆర్కే రోజా వితరణ కొనసాగుతోంది. ప్రతి బుధవారం వైద్య పరీక్షల నిమిత్తం వచ్చే గర్భిణులు, వారి సహాయకులకు కొన్నేళ్లుగా రోజా పౌష్టికాహారం వితరణ చేస్తుండటం విదితమే. 'రోజా చారిటబుల్ ట్రస్ట్' ఆధ్వర్యంలో యథావిధిగా పౌష్టికాహారం పంపిణీ చేశారు. వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పండిట్ దీన దయాళ్‌కు నివాళి



పండిట్‌జీకి నివాళులర్పిస్తున్న బీజేపీ నేతలు

నగరి: భారతీయ జనసంఘ్ నేత, భారతీయ జనతాపార్టీని ముందుకు నడిపిన నాయకుడు దీనదయాళ్ ఉపాధ్యాయకు బీజేపీ నేతలు నివాళులర్పించారు. దీన దయాళ్ జయంతిని పురస్కరించుకుని బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన సేవలను స్మరించారు. పార్టీ సీనియర్ నాయకులు రామ్మూర్తి యాదవ్ ఎల్.మునికృష్ణ, నాయకులు శేఖర్, వనిత, గణపతి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

యువకుడికి రిమాండ్

వెదురుకుప్పం: మద్యం తాగి వాహనం నడిపిన యువకుడిని వెదురుకుప్పం పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఎస్‌ఐ వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ మారేపల్లి గ్రామానికి చెందిన గణేష్ కుమారుడు జి.పవన్‌కుమార్ (23) మంగళవారం మద్యం తాగి వాహనం నడుపుతుండగా వెదురుకుప్పం పోలీసులకు పట్టుబడ్డాడు. యువకుడిని బుధవారం అరెస్టు చేసి పుత్తూరు కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి 15 రోజులు రిమాండ్ విధించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

పామును చూసి పరుగో పరుగు



కార్వేటినగరం: సంస్థానాధీశులు ప్రతిష్టాత్మకంగా నిర్మించిన స్కంధ పుష్కరిణి వద్ద బుధవారం నాగుపాము ప్రత్యక్షం కావడంతో సందర్శకులు, స్నానానికి వచ్చిన అయ్యప్పస్వామి భక్తులు పరుగులు తీశారు. నిత్యం భక్తులు రాకపోకలు సాగించే పుష్కరిణి మెట్ల వద్దకు నాగుపాము రావడంతో భక్తులు టీటీడీ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పుష్కరిణి చుట్టూ పిచ్చిమొక్కలు ఏపుగా పెరగడం వల్లే విష పురుగులు వస్తున్నాయని, వాటిని తొలగించడంలో టీటీడీ సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి భక్తులు, సందర్శకుల రాకపోకలకు ఇబ్బంది లేకుండా స్కంధ పుష్కరిణి మెట్లపై పిచ్చిమొక్కలను తొలగించాలని కోరుతున్నారు.


స్వచ్ఛతా హీ సేవలో భాగస్వాములు కండి



మానవహారంగా విద్యార్థులు

పాలసముద్రం: స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో అందరూ భాగస్వాములు కావాలని పాలసముద్రం ప్రభుత్వం ఉన్నత పాఠశాల హెచ్‌ఎం మీనాక్షి తెలిపారు. బుధవారం ఆ పాఠశాలలో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం జరిగింది. మీనాక్షి మాట్లాడుతూ స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో పరిసరాల పరిశుభ్రత, పచ్చదనం వంటి వాటిపై విద్యార్థులకు వివరించారు. ముఖ్యంగా ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పించారు. అనంతరం ర్యాలీ చేసి మానవహారంగా ఏర్పడ్డారు. టీచర్ ధనరాజ్ పాల్గొన్నారు.

సృజనాత్మకతను వెలికి తీయండి



టాలెంట్ టెస్ట్ రాస్తున్న విద్యార్థులు

శ్రీరంగరాజపురం: విద్యార్థుల్లో దాగివున్న ప్రతిభను వెలికి తీయడానికి సృజనాత్మకత చెకుముకి పోటీలు ఎంతగానో ఉపయోగపడతాయని ఎంఈఓ అరుణాచలంరెడ్డి అన్నారు. మండల వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన 450 మంది విద్యార్థులు స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న చెకుముకి టాలెంట్ టెస్ట్ పోటీల్లో పాల్గొన్నారు. పరీక్షల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు అక్టోబర్ 1న మండల స్థాయిలో పరీక్ష నిర్వహిస్తామన్నారు.

చిరుద్యోగులపై కక్ష సాధింపు

కూటమి నేతల రాజకీయ కక్ష సాధింపు చర్యలకు చిరుద్యోగులు బలవుతున్నారు. ఎన్నో ఏళ్ల నుంచి చిన్నపాటి ఉద్యోగాలతో కుటుంబాలు నెట్టుకొస్తున్న వారిపై వైఎస్సార్ సీపీ ముద్ర వేసి కడుపు కొడుతున్నారు. అధికారులపై ఒత్తిడి తెచ్చి ఫీల్డ్‌అసిస్టెంట్, డ్వాక్రా వీఓఏలు, రేషన్ డీలర్ల చేత బలవంతంగా రాజీనామా చేయిస్తున్నారు. ఫలితంగా గంగాధర నెల్లూరు నియోజకవర్గంలో సుమారు 25 మంది ఉపాధి కోల్పోయి రోడ్డున పడ్డారు.

- రాజకీయ వేధింపులతో ఫీల్డ్ అసిస్టెంట్, రేషన్ డీలర్ తొలగింపు
- టీడీపీ నేతల ఒత్తిళ్లకు తలొగ్గిన అధికార యంత్రాంగం



టీడీపీ నాయకుల ఒత్తిడితో ఫీల్డ్ అసిస్టెంట్‌పై విచారణ చేస్తున్న అధికారులు(ఫైల్)

పాలసముద్రం : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక, అన్ని ప్రభుత్వ శాఖల్లో ఉన్న నెలవారీ గౌరవ వేతనంతో పనిచేసే తాత్కాలిక ఉద్యోగులపై ప్రతాపం చూపుతోంది. గతంలో ఎన్ని ప్రభుత్వాలు మారిన ఫీల్డ్ అసిస్టెంట్లు, డ్వాక్రా వీఏఓలు, రేషన్ డీలర్లను తొలగించలేదు. ఎక్కడైనా అవకతవకలు జరిగినట్లు నిర్ధారణ అయిన వారిని మాత్రమే అధికారికంగా తొలగించారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మరుసటి రోజు నుంచే ఉపాధి హామీ పనులను నిలిపి వేసి, చేసిన పనులకు అధికారులు కనీసం కూలి డబ్బులు కూడా చెల్లించకపోగా వారి చేత బలవంతంగా రాజీనామా చేయిస్తున్నారు. ఉపాధి హామీ పథకంలో దాదాపు పదేళ్లుగా క్షేత్రసహాయకులుగా పనిచేస్తున్న వారిని సైతం ఉన్నపళంగా బలవంతంగా రాజీనామాలు చేయించి వారి కుటుంబాలను రోడ్డున పడేస్తున్నారు. కూటమి కక్ష సాధింపులకు బలై, వయోపరిమితి దాటిపోవడంతో మరే ఇతర ఉద్యోగాలు పొందలేని స్థితిలో వారు సతమతమవుతున్నారు.

పాలసముద్రం మండలంలో ముగ్గు ఫీల్డ్ అసిస్టెంట్లు, ముగ్గురు డీలర్లను టీడీపీ నాయకులు బెదిరింపులతో రాజీనామా చేయించారు. ఇసుక రవాణా, భూముల చదునుకు టీడీపీ నేతల జేసీబీలు, ట్రాక్టర్లు కాకుండా ఇతరులవైతే వాటిని అడ్డగించి, బెదిరించి, పోలీస్‌స్టేషన్‌కి తరలించి అక్రమ కేసులు బనాయిస్తున్నారు.



–ఈయన పేరు లోకేష్ శ్రీకావేరి రాజుపురం పంచాయతీలో ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నాడు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వైఎస్సార్ సీపీ కార్యకర్త అని ముద్రవేసి అతనిని తొలగించేందుకు తీవ్ర స్థాయిలో ఒత్తిడి తెచ్చారు. ఓ వైపు నాయకులు, మరో వైపు అధికారుల ఒత్తిడికి తట్టుకోలేక ఫీల్డ్ అసిస్టెంట్ ఉద్యోగానికి రాజీనామా చేయాల్సిన పరిస్థితి తెచ్చారు.



–ఈమె పేరు సరస్వతి. సింహరాజు పురం పంచాయతీలో రేషన్ షాపు డీలర్ ఆమె. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి టీడీపీ నాయకులు, అధికారులు రాజీనామా చేయాలని ఒత్తిడి చేస్తున్నారు. అయినా ఆమె వెరవక పోవడంతో రెండు నెలలు అధికారులు ఆమె రేషన్ షాప్‌కు సరుకులు పంపిణీ నిలుపుదల చేశారు. దీంతో ఆమె గోడోన్‌కు వెళ్లి సరుకులు తీసుకొచ్చి పంపిణీ చేశారు. దీంతో టీడీపీ నాయకులు, అధికారులు బెదిరింపులకు దిగారు. షాపుపై విజిలెన్స్ దాడులు చేయిస్తామని, లక్ష రూపాయలు జరిమానా విధించేలా చేస్తామంటూ తీవ్రస్థాయిలో బెదిరించడంతో విధిలేక ఆమె డీలర్‌షిప్‌కు రాజీనామా చేశారు.

మెరుగైన వైద్యసేవలు అందించండి



పెనుమూరు సీహెచ్‌సీ సిబ్బందితో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్



సీహెచ్‌సీలో రికార్డులను పరిశీలిస్తున్న డీసీహెచ్‌ఎస్ ప్రభావతి

పెనుమూరు(కార్వేటినగరం): వైద్యాధికారులు తప్పనిసరిగా సమయపాలన పాటించాలని జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ అన్నారు. బుధవారం ఆయన మండల కేంద్రంలోని సామాజిక, ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పెనుమూరు సీహెచ్‌సీలో గైనిక్ సేవలను మెరుగుపరచాలన్నారు. ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, అలాగే డాక్టర్లు సాధారణ ప్రసవాలు చేసేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. మూడు నెలలకు సరిపడా అత్యవసర మందులు, ల్యాబ్‌కు అవసరమైనవి, శానిటరీ వస్తువులు కొనుగోలు చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు, సీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ గీత, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సీహెచ్‌సీ తనిఖీ

కార్వేటినగరం: వైద్య సిబ్బంది మెరుగైన వైద్యసేవలతో మన్ననలు పొందాలని జిల్లా సామాజిక సమన్వయ వైద్యాధికారిణి డాక్టర్ ప్రభావతి ఆదేశించారు. బుధవారం ఆమె సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. సీహెచ్‌సీ సంబంధించిన రికార్డులను, సీహెచ్‌సీలో ప్రతి విభాగాన్ని పరిశీలించిన అనంతరం మాట్లాడారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సామాజిక ఆరోగ్యకేంద్రాలను ఆకస్మిక తనిఖీ చేస్తున్నట్లు చెప్పారు. రోగులతో సిబ్బంది స్నేహపూర్వకంగా ఉండాలని, అలాగే విధి నిర్వహణలో సమయపాలన పాటించాలన్నారు. సీహెచ్‌సీలో వైద్య నిపుణులు అందుబాటులో ఉన్నా సౌకర్యాల లేమి ఉంటోందని, నూతన భవనం పూర్తయిన వెంటనే మెరుగైన వైద్యసేవలు అందివ్వడానికి వీలవుతుందని సిబ్బంది ఆమెకు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ గోపినాథ్, డాక్టర్ యూసఫ్‌ఖాన్, శృతి భార్గవి, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

క్రీడలతోనూ భవిత : డీవైఈఓ



పరుగు పందెం పోటీలో క్రీడాకారులు



చెస్ పోటీలు ప్రారంభిస్తున్న డీవైఈఓ ప్రభాకర్‌రాజు

పుత్తూరు: చదువుతోనే కాకుండా క్రీడలతోనూ భవితకు బాటలు వేసుకుని ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చని పుత్తూరు డీవైఈఓ ప్రభాకర్‌రాజు అన్నారు. బుధవారం స్థానిక ఎస్‌ఆర్‌ఎస్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్స్ నగరి నియోజకవర్గ స్థాయి పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. క్రీడలు శారీరక, మానసికోల్లాసాన్ని కలిగిస్తాయని, ప్రతి విద్యార్థి తమకిష్టమైన క్రీడలో ప్రావీణ్యం పొంది నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయిలో పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. అనంతరం అండర్–14, అండర్–17 బాల బాలికలకు నియోజకవర్గ స్థాయి అథ్లెటిక్స్, చెస్, బ్యాడ్మింటన్, యోగా పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈఓలు తిరుమలరాజు, బాలసుబ్రమణ్యం, హెచ్‌ఎం సునీత, నియోజకవర్గ కో–ఆర్డినేటర్ గుర్రప్ప, మండల కో–ఆర్డినేటర్లు నంద కుమార్, మణి, సుబ్రమణ్యం, కేశవులు, చంద్రశేఖర్ రాజు, గోపి, ఫిజికల్ డైరెక్టర్లు మోహన, భూపతి, సరేష్‌బాబు, అరుణ, స్వప్న, సునీత, వహిదాబేగం, కవిత, సుజాత, రూప, శివప్రసాద్ పాల్గొన్నారు.

చదరంగం పోటీల్లో ముడిపల్లె విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు

నగరి : పుత్తూరు ఎస్‌ఆర్‌ఎస్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల వేదికగా బుధవారం నియోజకవర్గ స్థాయిలో నిర్వహించిన 68వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ చదరంగ పోటీల్లో నగరి మండలం ముడిపల్లె జెడ్పీ హైస్కూలు విద్యార్థులు ప్రతిభ చాటారు. అండర్–17 బాలుర విభాగంలో యోగేష్, రూపకేశవ, ఆనస్ట్‌రాజ్, బాలికల విభాగంలో ఆషాబి, నవ్యశ్రీ, నందిని, అండర్–14 బాలుర విభాగంలో సిద్దిక్, బాలికల విభాగంలో దీప ప్రతిభ కనబరచి జిల్లా స్థాయి చదరంగ పోటీలకు ఎంపికయ్యారు. వారిని ప్రధానోపాధ్యాయులు మురళీకృష్ణ, చెస్ కోచ్ ఆనంద మోహన్, పీఈటీ మునికుమార్ అభినందించారు.

ఉత్సాహంగా చెకుముకి పోటీలు



బాలికల జెడ్పీ హైస్కూల్లో చెకుముకి టాలెంట్ టెస్ట్ రాస్తున్న విద్యార్థినులు



పుదుపేట జడ్పీ హెచ్‌ఎస్‌లో..

నగరి : మండలంలోని పన్నెండు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో బుధవారం జన విజ్ఞాన వేదిక చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ పోటీలు నిర్వహించారు. 8, 9, 10 తరగతులకు చెందిన 700 మంది విద్యార్థులు ఈ పోటీలకు హాజరయ్యారు. స్థానిక బాలికల జెడ్పీహెచ్‌ఎస్, మండలంలోని ఎం.కొత్తూరు జెడ్పీ హెచ్‌ఎస్‌లో టాలెంట్ టెస్ట్ పోటీలను ఎంఈఓ నమశ్శివాయం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పాఠశాల స్థాయిలో విద్యార్థుల ప్రతిభ గుర్తించేందుకే టాలెంట్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇలాంటి పోటీ పరీక్షల్లో పాల్గొంటే భవిష్యత్‌లో పోటీ పరీక్షలపై విద్యార్థులకు భయం ఉండదన్నారు. బాలికల జెడ్పీ, ఎం.కొత్తూరు జెడ్పీ హెస్కూళ్లు పీఎంశ్రీ పాఠశాలలుగా ఎంపికయ్యాయని, ఒక్కో స్కూల్‌లో ప్లే గ్రౌండ్, సైన్స్ ల్యాబ్ నిర్మాణానికి రూ. 20 లక్షలు నిధులు మంజూరు చేస్తారని, పీఎంశ్రీ నోడల్ ఆఫీసర్ అయిన తన పర్యవేక్షణలో పనులు చేయనున్నట్లు చెప్పారు. సమగ్ర శిక్ష ఏఈ నాగభూషణం, ప్రధానోపాధ్యాయులు గీతాకుమారి, పార్వతీ దేవి, జనవిజ్ఞాన వేదిక కో–ఆర్డినేటర్ మునిరత్నం పాల్గొన్నారు. టాలెంట్ టెస్ట్ విజేతలకు ప్రశంసా పత్రాలు అందజేశారు.

భూసార పరీక్ష తప్పనిసరి



విజయపురం: కలియంబాకంలో నిర్వహిస్తున్న 'పొలం పిలుస్తోంది'



నింద్ర: కొప్పేడులో పోస్టర్లు ఆవిష్కరిస్తున్న రైతులు, ఏఓ



గంగాధరనెల్లూరు: పెద్దకాలవ గ్రామంలో వేరుశనగ పంటను పరిశీలిస్తున్న అధికారులు

విజయపురం: భూసార పరీక్షల ఆధారంగా పంటలు సాగు చేస్తే మంచి ఫలితాలు పొందవచ్చని ఏఈఏ సౌభాగ్యలక్ష్మి అన్నారు. బుధవారం మండలంలోని కలియంబాకంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. చెరకు, వరి పంటను ఆమె పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, మోతాదుకు మించి రసాయన ఎరువులు వాడడం, పంట వ్యర్థాలను కాల్చడం వలన నేలకు అవసరమైన సూక్ష్మజీవులు చనిపోయి, నేల సారవంతం కోల్పోతుందన్నారు. భూసార పరీక్షలతో నేలలో లభ్యమయ్యే పోషకాలతో పాటు చౌడు గుణాలు, ఎక్కువ సున్నం కలిగిన గుణాలను కూడా తెలుసుకుని తద్వారా ఎరువుల యాజమాన్య పద్ధతులు పాటిస్తే పంటల సాగుకు పెట్టుబడి ఖర్చులు తగ్గించుకోవచ్చని రైతులకు సూచించారు.

నింద్రలో..

నింద్ర: మండలంలోని నింద్ర, కొప్పేడులో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మండల వ్యవసాయాధికారి తులసీరాం నిర్వహించారు.నూతన పద్ధతిలో వరి సాగు విధానం గురించి రైతులకు అవగాహన కల్పించారు. అలాగే మండలంలో ఏయే రోజుల్లో ఎక్కడెక్కడ పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహిస్తారో దానికి సంబంధించి పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పశు వైద్య, వ్యవసాయశాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పొలం పిలుస్తోంది సద్వినియోగం చేసుకోండి

గంగాధరనెల్లూరు: పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి మురళీక్రిష్ణ, జిల్లా పశు సంవర్ధక శాఖాధికారి డా.ప్రభాకర్ కోరారు. మండలంలోని పెద్దకాలవ గ్రామంలో బుధవారం రైతు సేవా కేంద్రం వద్ద పొలం పిలుస్తోంది కార్యక్రమంలో జిల్లా అధికారులు పాల్గొన్నారు. గ్రామ సర్పంచ్ ఏకాంబరం, మండల వ్యవసాయాధికారి భవాని, రైతులు పాల్గొన్నారు.

డీఏ వెంటనే ప్రకటించాలి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నేతలు

పాలసముద్రం: ఉపాధ్యాయులకు ఇవ్వాల్సిన డీఏను కూటమి ప్రభుత్వం వెంటనే ప్రకటించాలని జిల్లా ఎస్టీయూ సంఘ అధ్యక్షుడు మదన్‌మోహన్‌రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని ఆముదాల, వెంగళరాజుకుప్పం, ఎస్ ఆర్ కండ్రిగ, పాలసముద్రం ఉన్నత పాఠశాలల్లో మండల ఎస్టీయూ సంఘ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 2024 జనవరి నుంచి ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇవ్వాల్సిన డీఏను వెంటనే ప్రకటించాలని, 12వ పీఆర్‌సీకి సంబంధించి 30 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలని డిమాండ్ చేశారు. అనంతరం సమస్యల పోస్టర్లను ఆవిష్కరించారు. ఎస్టీయూ జిల్లా కౌన్సిలర్లు చంద్రశేఖర్‌నాయుడు, కోదండయ్య, మండల ఎస్టీయూ అధ్యక్షుడు కుమార్, ప్రధాన కార్యదర్శి ప్రకాష్, ఆనందయ్య, రఘు, వెంకటేష్, పాల్గొన్నారు.

29న ఉచిత కంటి వైద్య శిబిరం

కార్వేటినగరం: స్వయంకృషి జనహిత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 29న ఆదివారం స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు బుధవారం మండల విద్యాశాఖ అధికారి విజయ కుమార్ విలేకరులకు తెలిపారు. శ్రీవెంకటేశ్వర అరవింద్ కంటి ఆస్పత్రి వైద్యులు రోగులను పరీక్షిస్తారని, వైద్య పరీక్షలకు హాజరయ్యేవారు ఆధార్ కార్డు వెంట తీసుకురావాలని చెప్పారు. అలాగే గుండెజబ్బులు, ఆస్తమా, మధుమేహం, క్యాన్సర్ తదితర దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు దీనికి సంబంధించిన రిపోర్టులు ఉన్నపక్షంలో తీసుకురావాలన్నారు.

రోడ్లు ఛిద్రం..ప్రయాణం నరకం

-పట్టించుకోని పాలకులు



మంగళం చెరువు కట్టపై దెబ్బతిన్న రోడ్డు



విజయపురం దళితవాడ వద్ద దెబ్బతిన్న రోడ్డు

మండలంలోని రహదారులు గుంతలమయం కావడం, దీనికి తోడు వర్షాలకు మరింత అధ్వానంగా మారాయి. ఫలితంగా వివిధ మార్గాల్లో వాహనచోదకులు, ప్రయాణికులు ఇబ్బందులు నడుమ ప్రయాణం సాగిస్తున్నారు. అధికారంలోని కూటమి ప్రభుత్వం కనీసం గుంతలకు కనీసం తట్టెడు మట్టి కూడా వేయించకపోవడం శాపంగా మారిందని ప్రయాణికులు మండిపడుతున్నారు.



ముత్యాలరెడ్డికండ్రిగ వద్ద దెబ్బతిన్న రోడ్డు

విజయపురం: మండలంలోని తిరుత్తణి రోడ్డు నుంచి విజయపురం వెళ్లే తారురోడ్డు అధ్వానంగా ఉంది. ఇటీవల కురిసిన వర్షానికి రోడ్డు పూర్తిగా దెబ్బతింది. అక్కడక్కడా రోడ్డు దెబ్బతినడంతో వర్షపు నీరు నిలిచి ప్రమాదకరంగా మారింది. విజయపురం మండల కేంద్రానికి వెళ్లాలంటే ఇదే ప్రధానమైన మార్గం. ప్రజలు మొదలు అధికారుల వరకు ఈ రోడ్డు మీదుగానే వెళ్లాలి. నగరి నుంచి బస్సు మార్గంలో విజయపురం వెళ్లాలంటే సుమారు 26 కిలోమీటర్లు ఉంది. అయితే గ్రామీణ రహదారి మీదుగా విజయపురం చేరుకోవడానికి కేవలం 16 కిలోమీటర్లు మాత్రమే. ఈ మార్గంలో ఎక్కువగా లారీలు, ట్రాక్టర్లు, ద్విచక్రవాహనాలు వెళ్తుంటాయి. అంతే కాకుండా కేవీపురం, కాళికాపురం, గంగమాంబపురం, సీఎస్ కండ్రిగ, మంగళకండ్రిగ, గాండ్లకండ్రిగ, ముత్తప్పకండ్రిగతో పాటు మరో 10 పంచాయతీ ప్రజలకు ఇది ప్రధానమైన రోడ్డు. ఇలాంటి రోడ్డు ప్రస్తుతం వర్షానికి దెబ్బతినడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఉందని గ్రామీణ ప్రజలు వాపోతున్నారు.

నాణ్యతా ప్రమాణాలు నిల్

ప్రస్తుతం కాంట్రాక్టర్లు నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా రోడ్లు వేస్తున్నారని, అధికారుల పర్యవేక్షణ లోపించడంతో కాంట్రాక్టర్లదే ఇష్టారాజ్యంగా మారిందని ప్రజలు మండిపడుతున్నారు. గుంతలమయమైన రోడ్లపై వర్షపు నీరు నిల్వ ఉండడంతో ద్విచక్రవాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు.

గుంతలు పూడ్చండి



"తిరుత్తణి–విజయపురం రోడ్డుపై గుంతలను పూడ్చాలి. రాత్రి పూట ఈ మార్గంలో రావడానికి కష్టంగా ఉంది. వర్షపు నీరు నిలిచిపోవడంతో ఎక్కడ గుంత ఉందో తెలియడం లేదు. ఎందరో మోటార్ సైకిలిస్టులు పడి గాయాలపాలవుతున్నారు.

– జయరాం, విజయపురం

ప్రమాదకరంగా మారింది



విజయపురం నుంచి నగరి, తిరుత్తణికి ఉన్న ప్రధాన మార్గం ఈ మధ్య వర్షానికి పూర్తిగా దెబ్బతింది. మోటార్ సైకిల్‌లో వెళ్లాలంటే భయంగా ఉంటుంది. కొత్తగా వచ్చే వారు కింద పడిపోతున్నారు. అధికారులు ఈ రోడ్డును బాగు చేయాలని కోరుతున్నాం.

– కన్నన్, విజయపురం

భక్తిప్రపత్తులతో అష్టమి పూజలు





పుష్పాలంకరణలో కాలబైరవ స్వామి, పూజలకు హాజరైన భక్తులు

నగరి: మహా కాళభైరవ అష్టమిని పురస్కరించుకుని బుధవారం స్థానిక కామాక్షి సమేత కరకంఠేశ్వర ఆలయంలోని కాలభైరవ స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి పంచామృతం, విభూదితో ప్రత్యేక అభిషేకానంతరం మూలవిరాట్‌ను పుష్పాలతో అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై కర్పూర నీరాజనాలు సమర్పించారు.